
సాక్షి అనకాపల్లి

బుధవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2024



ఈక్విటీకి వెళ్లిపోతాం 10లో

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నష్టాల బారినపడడంతో షేర్ ముఖ విలువ తగ్గుముఖం పట్టింది. దీంతో ఈక్విటీలకు వెళ్లిపోవాలని భావిస్తున్నారు.



ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్

ఐదు గ్రామాలను ఎంపిక చేసి పూర్తిస్థాయిలో సోలార్ మోడల్‌గా రూపొందించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. 10లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 16న 6 మి.మీ, 17న 4, 18న 4, 19న 8, 20న 10 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొల్లు రవీంద్ర



తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొల్లు రవీంద్రను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్న ఆయన మచిలీపట్నం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన బుధవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటల నుంచి 3, 4వ సంఘ సమావేశాలు, 12 గంటల నుంచి 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

మహిళా కళాశాలలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

దాబాగార్డెన్స్ (విశాఖ): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, ఎంకామ్, ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులకు సంబంధించి ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

రేపు నీతి ఆయోగ్ సీఈవో రాక

మహారాణిపేట (విశాఖ): నీతి ఆయోగ్ ఇండియా సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఈనెల 17న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో రాత్రి 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 18వ తేదీన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ రోజు రాత్రి 11.10 గంటలకు తిరిగి ఢిల్లీ వెళ్తారు.

న్యాయ సేవల హెల్ప్‌లైన్ నంబర్ 15100

అనకాపల్లి: బాధితులు న్యాయ సేవల కోసం 15100 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించుకోవచ్చని లీగల్ సర్వీసెస్ అథారిటీ మండల చైర్‌పర్సన్ ఎస్.శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నేషనల్ లీగల్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ బాధిత ప్రజల కోసం ఉచిత హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. బాధితులెవరైనా న్యాయ సంబంధిత సేవల కోసం హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించి సహాయం పొందవచ్చన్నారు.

గొప్ప చరిత్రకారుడు గద్దర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప చరిత్రకారుడు గద్దర్ అని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గద్దర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు, బహుజనుల కోసం తన జీవితాంతం సాహిత్య సేవ చేశారని గుర్తు చేశారు. తన పాటతో, గళంతో ప్రభుత్వాలని కడవరకు ప్రశ్నించారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఒ.జాన్ మాట్లాడుతూ ఈ నెల 20న ఉదయం 10 గంటలకు టీఎల్ఎన్ సమావేశ మందిరంలోను, మధ్యాహ్నం 2 గంటలకు పౌర గ్రంథాలయంలో గద్దర్ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు రీసెర్చ్ స్కాలర్స్, కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు ప్రేమానందం, జర్ర అప్పారావు, పాటల తూట ఉదయభాస్కర్, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, అంబేద్కర్, ఆరేటి మహేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ ఎంప్లాయీస్ (టీచర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.షారోన్ రాజు, మోహన్, జై భీమ్ ప్రకాష్, రాయ్, రమణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బళ్లతో ఇసుక దందా!



ఎడ్ల బళ్లతో ఇసుక తరలింపు దృశ్యం

- సొంతిల్లు నిర్మాణం పేరిట బళ్లతో తరలింపు
- అనంతరం ట్రాక్టర్లతో దూర ప్రాంతాలకు సరఫరా

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాయకుల అండతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది సొంత అవసరాల కోసం తోలుకుంటుంటే, మరి కొందరు వ్యాపారం చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం ఉత్తరవాహిని, నాతవరం మండలం తాండవ నది, గుమ్మిడికొండ, చిక్కుడుపాలెం, మాకవరపాలెం సర్పా, వరహా నది, బీఎస్.పేట, కొండల అగ్రహారం, బూరుగుపాలెం, తూటిపాలగుండుబాడు గెడ్డ, గొలుగొండ మండలం చోద్యం, కేడీ పేట, విప్పలపాలెం, బొడ్డేరు గెడ్డ నుంచి ఇసుకను తలించుకుపోతున్నారు. గబ్బాడ ఇసుక డిపోలో 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నప్పటికీ సరఫరాకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



ఇటీవల పోలీసులు పట్టుకున్న ఇసుక వాహనాలు

దీంతో ఇసుక కొరత ఏర్పడింది. ఇళ్ల నిర్మాణాలకు సరిపడా ఇసుకను తవ్వుకుని కేవలం ఎడ్ల బళ్లతో తరలించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. స్థానికంగా ఎవరైనా ఇల్లు నిర్మించుకోవాలంటే ఎంత అవసరమో, అంతే తీసుకెళ్లాలి. ఇదే కొందరు నాయకులకు వరంగా మారింది. ఎడ్ల బళ్లతో నదీ గర్భాల్లోని ఇసుకను తీసుకొచ్చి ఓ చోట డంప్ చేస్తున్నారు. నాలుగు బళ్ల ఇసుక ఓ ట్రాక్టర్ లోడు అవుతుంది. ఆ ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేలకు కొనుగోలు చేసి దూరాన్ని బట్టి రూ.8500 నుంచి రూ.9 వేలకు విక్రయించి పలువురు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎడ్ల బళ్ల నిర్వాహకులు నేరుగా సమీపంలోని నిర్మాణదారులకు రూ.1100 నుంచి రూ.1500కు విక్రయిస్తున్నారు. తమకు వచ్చిన ఆదాయంలో కొంత రెవెన్యూ, పోలీసులకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అడపాదడపా ఇసుక వాహనాలను పట్టుకున్నప్పటికీ నామమాత్ర అపరాధ రుసుం విధించి విడిచిపెడుతున్నారు.

తెల్లవారుజాము నుంచే తవ్వకాలు

సొంతింటి నిర్మాణం పేరు చెప్పి బళ్లతో తీసుకొచ్చిన ఇసుకను వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు సైతం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి రోజూ ఒక్కో బండి ద్వారా ఆరు నుంచి పది ట్రిప్పులు, ట్రాక్టర్ల అయితే దూరాన్ని బట్టి మూడు నుంచి నాలుగు ట్రిప్పులు వరకు ఇసుకను తరలిస్తున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీతో పాటు పరిసర మండల కేంద్రాల్లో దాదాపు 400 వరకు ఎడ్ల బళ్లు, 120 వరకు ట్రాక్టర్లు, టిప్పర్లు ఉన్నాయి. తెల్లవారుజామున మూడు గంటల నుంచే ఇసుక దందా ప్రారంభమవుతుంది. ప్రతి రోజూ రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉచిత ఇసుక అమలుకు చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణదారుల, కార్మికులు కోరుతున్నారు.

పాత డిపోను పునః ప్రారంభించాలి



స్టాక్ పాయింట్ తెరవక ఇబ్బంది పడుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 115 రోజులు అవుతున్నా డిపోలో ఉన్న ఇసుకను విక్రయించలేదు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండాపోయాయి. ప్రైవేటు వ్యక్తులు నదుల్లో సేకరించిన ఇసుకను అధిక ధరకు అమ్ముతున్నారు. దీంతో నిర్మాణదారులు కొనేందుకు వెనకాడుతున్నారు. స్టాక్ పాయింట్‌ను తెరిస్తే సామాన్యులకు మేలు చేసినట్టువుతుంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాత డిపోను పునః ప్రారంభించి, ఇసుక దోపిడిని అరికట్టాలి.

– కిల్లాడ రామకృష్ణ, తాపీమేస్త్రి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

‘కొత్త’ పెత్తనంపై గరం గరం



దేవరాపల్లిలో సమావేశమైన టీడీపీ సీనియర్ నేతలు

- దేవరాపల్లి టీడీపీలో తార స్థాయికి వర్గ విభేదాలు
- కొత్తగా చేరిన వారికి పెద్దపీట.. టీడీపీ పాత నేతల తిరుగుబాటు
- పార్టీ జెండా మోసిన వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన
- రహస్యంగా సమావేశమైన టీడీపీ సీనియర్ నేతలు

దేవరాపల్లి: మండల తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. వలస టీడీపీ, పాత టీడీపీ నేతల మధ్య పోరు తార స్థాయికి చేరుకుంది. గ్రామంలో ఆధిపత్యం కోసం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎదుటే ఇటీవల కుమ్ములాటకు దిగిన తమ్ముళ్లు మరో అడుగు ముందుకేసి బహిరంగ విమర్శలకు దిగారు. ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వలస నేతకు కొన్ని విషయాలలో ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇవ్వడాన్ని పాత టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలోనే మండల కేంద్రం దేవరాపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు మహేశ్వరీ నాయుడు ఇంటి ఆవరణలో గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లి దేముళ్లు అధ్యక్షతన పాత టీడీపీ నేతలంతా మంగళవారం రహస్యంగా సమావేశమై తమ గోడును వెళ్లగక్కారు. ఈ సమావేశానికి టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా పాత టీడీపీ నేతలు మాట్లాడుతూ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన దేవరాపల్లి వలస నేతలకు టీడీపీలో ప్రాధాన్యత కల్పించడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లో పార్టీలు మారుస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలను అణగదొక్కి, అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వలస నేతను అందలం ఎక్కించడం తమను అవమానపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకొని టీడీపీ జెండాను మోసిన వారిని నట్టేట ముంచడం సరికాదన్నారు.

వలస నేత ముంచేయడం ఖాయం

దేవరాపల్లికి ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన గోకుల షెడ్లు, అభివృద్ధి పనుల నిధులను గ్రామ శాఖ అధ్యక్షుడికి, టీడీపీ సీనియర్ నేతలకు సైతం తెలియజేయకుండా వలస నేతకు అప్పగించడం బాధాకరమన్నారు. గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీలో అధికారాన్ని అనుభవించి ఎన్నికల ముందు ఆ పార్టీని మోసగించి టీడీపీలో చేరిన వలస నేత.. అదే మాదిరిగా టీడీపీని సైతం మోసగించడం ఖాయమని, ఈ విషయాన్ని పార్టీ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ విషయాలన్నింటినీ ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకెళ్లి పార్టీని నమ్ముకున్న వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని మండల పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్లేటి కరుణాకర్‌రావు, దేవరాపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లి దేముళ్లు, గంగవంశం సత్తిరాజు, డి.సత్తిబాబు, కొరుప్రోలు చంద్రరావు, కాటపల్లి సన్యాసిరావు, చిటికిరెడ్డి కొండబాబు, బి.అప్పలనాయుడు, గుల్లిపల్లి ఎర్రయ్యమ్మ, బాబ్జీ, ఎలుసూరి మహలక్ష్మి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్ విద్యార్థులకు ర్యాంకుల పంట

- బీఎస్సీ అగ్రిసెట్‌లో టాప్ ర్యాంకులు కైవసం

అనకాపల్లి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన అగ్రిసెట్ 2024 ఫలితాల్లో అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌కు చెందిన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. తమ విద్యార్థులకు వందలోపు ఆరు ర్యాంకులు వచ్చాయని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ సీహెచ్.ముకుంద రావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చారుమతి తెలిపారు. అనకాపల్లి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు 13, 16, 20, 41, 43, 58, 71, 86, 98, 119, 122, 126, 135, 143, 153, 161 ర్యాంకులు లభించాయి. విజేతలను మంగళవారం కళాశాలలో అభినందించారు. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకూ ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని ఏడీఆర్ ముకుందరావు చెప్పారు.



ఎం.అహ్మద్ (13వ ర్యాంక్)



పి.సుజాత (16వ ర్యాంక్)

బీఎస్సీ అగ్రిసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు వీరే..

ఎం.అహ్మద్ (13వ ర్యాంక్), పి.సుజాత (16వ ర్యాంక్), వై.శాంతి (20), కె.రాహుల్‌రెడ్డి (41), యు.లిఖిత (43), యు.శేఖర్‌బాబు (58), డి.దివ్యశ్రీ (71), ఎన్.తేజేశ్వరి (86), ఎల్.మమత (98), బి.నమ్రత (119), ఎం.శివవాణి (122), బి.దిల్లేశ్వరి (126), పి.హుస్సేన్ (135), వి.గౌరీశ్వరి (143), ఎస్.నితిన్ (153), వై.ఎస్.వి.లక్ష్మి (161వ ర్యాంక్)

20న ‘ఐక్యరాజ్య సమితి’పై పోటీలు

తగరపువలస (విశాఖ): ఐక్యరాజ్యసమితి స్థాపించి ఈ నెల 24తో 79 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఈ నెల 20న జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తోంది. ఐక్యరాజ్య సమితిలో లోపాలేమిటి? వాటిని ఎలా అధిగమించాలి అనే అంశంపై తెలుగు, హిందీ భాషల్లో వ్యాసరచన, అగ్రరాజ్యాలకు నాటో అధికారంపై విమర్శనాత్మకంగా ఉపన్యాస పోటీలు, ప్రపంచ శాంతిపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయని పేర్కొంది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి 24న బహుమతులు అందిస్తామని మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. మరిన్ని వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

మహిళను రక్షించిన పోలీసులు

అల్లిపురం (విశాఖ): కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన మహిళను నగర పోలీసులు కాపాడారు. మంగళవారం ఒక వివాహిత తన భర్త వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు ఆర్కే బీచ్‌లోకి వెళ్లడాన్ని అక్కడే విధుల్లో ఉన్న మొబైల్ పోలీస్, లైఫ్‌గార్డులు గమనించారు. తక్షణమే ఆ మహిళను నిలువరించారు. ఆమె వివరాలు అడిగి తెలుసుకున్న పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కౌన్సెలింగ్ చేపట్టి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీసులను అభినందించారు.

ప్రొఫెసర్ సాయిబాబాది కేంద్ర ప్రభుత్వ హత్యే

సీతమ్మధార (విశాఖ): మానవ హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబా మరణం కేంద్ర ప్రభుత్వ హత్యేనని ప్రజా గాయకుడు, పర్యావరణ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి దేవిశ్రీ ఆరోపించారు. సాయిబాబా మృతికి సంతాపంగా జీవీఎంసీ గాంధీపార్కులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సాయిబాబా ఉద్యమ స్ఫూర్తిపై పలు గీతాలను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా జీవితకాలం నమ్మిన సిద్ధాంతాల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. కేంద్రప్రభుత్వం అకారణంగా పదేళ్లు ఆయన్ని జైలు జీవితం అనుభవించేలా చేసిందని ఆక్షేపించారు. న్యాయస్థానం ఆయన్ని నిర్దోషిగా విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఇది కేంద్ర ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి, పాటల తూటా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ, సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ప్రొఫెసర్ సాయిబాబా అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్రప్రభుత్వాన్ని గడగడలాడించిన చరిత్రను మర్చిపోరాదన్నారు. కార్యక్రమంలో పర్యావరణ కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొయ్య రామకృష్ణ యాదవ్ శ్రీనివాస్, జీవ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న ప్రజాగాయకుడు దేవిశ్రీ

రీసర్వే గ్రామాల్లో రేపటి నుంచి గ్రామ సభలు

- పొరపాట్లు దొర్లితే సరిచేయాలి
- తహసీల్దార్లకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

తుమ్మపాల: భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గురువారం నుంచి గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో రీ సర్వే పూర్తయిన 455 గ్రామాల్లో ఈ సభలు నిర్వహించాలన్నారు. 30 రోజుల్లో గ్రామ సభలు పూర్తయ్యేలా షెడ్యూలు తయారు చేసుకోవాలని సూచించారు. అన్ని రకాల భూసమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించాలన్నారు. రీసర్వేతో నష్టపోయినట్లు రైతులెవరైనా ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వేలో జరిగిన పొరపాట్లను గ్రామసభల ద్వారా సరి చేయాలన్నారు. గ్రామ సభ నిర్వహణపై ముందుగా గ్రామంలో ప్రచారం చేసి, తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామస్థాయి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.



పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ చెప్పారు. అర్జీలకు ఏదో ఒక సమాధానం రాసి పంపకుండా, పూర్తిగా పరిశీలించి, అర్థం చేసుకుని పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు ప్రతిరోజు మొదటి పనిగా తమ కార్యాలయానికి వచ్చిన అర్జీలను పరిశీలించాలని, ఫిర్యాదుదారునితో నేరుగా మాట్లాడాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి సమస్యను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దారు పంపిన రిపోర్టు ఏ స్థాయిలోను వ్యతిరేకించలేని విధంగా వాస్తవాలతో సమాధానం ఉండాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వి.ఎల్.ఎస్.మూర్తి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ పి.జయంతి, సర్వే శాఖ సహాయ సంచాలకుడు గోపాల కృష్ణ, ఇతర అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అధ్యయనం పేరుతో దోపిడీ?

- 20 నుంచి జీవీఎంసీ కార్పొరేటర్ల అధ్యయన యాత్ర
- గతంలో కంటే ఒక్కొక్కరిపై అదనంగా రూ.24 వేలు ఖర్చు
- సొమ్ము ప్రజలది.. సోకు కార్పొరేటర్లది అంటూ విమర్శలు

దాబాగార్డెన్స్ (విశాఖ): అధ్యయన యాత్ర పేరుతో జీవీఎంసీ కార్పొరేటర్లు విలాస యాత్రకు సిద్ధమైపోయారు. ఈ నెల 20న టూర్‌కు బయలుదేరనున్నారు. 8 రోజుల పాటు బెంగళూరు, మైసూరు, బందీపూర్, ఊటీ, పానాజీ తదితర ప్రాంతాలను సందర్శించనున్నారు. అక్కడ స్టార్ హోటళ్లలో బస, లగ్జరీ బస్సుల్లో విహార యాత్ర చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సందర్శించనున్నారు. ఆధునిక మురుగునీటి నిర్వహణ, మంచినీటి సరఫరా తదితర కార్యక్రమాలను పరిశీలించనున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, కొత్త ప్రాజెక్ట్‌ల రూపకల్పన కోసం గతంలో కార్పొరేటర్లు అధ్యయన యాత్ర పేరుతో పలు రాష్ట్రాలను సందర్శించారు. అయితే ఈసారి చేస్తున్న అధ్యయన యాత్రపై మాత్రం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పెరిగిన ఖర్చు.. తగ్గిన రోజులు

గతంలో అధ్యయన యాత్రకు ఒక్కొక్కరికీ రూ.95 వేలు వరకు వెచ్చించగా.. ఇప్పుడు రూ.24 వేలు అదనంగా జోడించి మొత్తంగా రూ.1.19 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం దాదాపు రూ.1.16 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. కేవలం ముందస్తు అనుమతులు పేరుతో ఇందుకు సంబంధించి ఇటీవలే టెండర్ల ప్రక్రియను సైతం పూర్తి చేశారు. గతంలో 12 రోజులు అధ్యయన యాత్ర చేస్తే.. ప్రస్తుత యాత్ర కేవలం 8 రోజులు మాత్రమే. రోజులు తగ్గినప్పటికీ.. ఖర్చు మాత్రం పెరగడం గమనార్హం. మిగిలిన సొమ్ము దోచుకునేందుకు కూటమి కార్పొరేటర్లు స్కెచ్ వేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరంలో సోలార్ విద్యుద్దీపాల ఏర్పాటు, వాణిజ్య సముదాయాలతో అతిథి గృహాల నిర్మాణాల బడ్జెట్‌లో కోతలు పెట్టాలని కౌన్సిల్‌లో డిమాండ్ చేసిన కార్పొరేటర్లు.. విహార యాత్రకు ఇంత మొత్తం కుమ్మరించడంపై మండిపడుతున్నారు. స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడే నిర్ణయాలు తీసుకోకూడదని ప్రభుత్వ ఆదేశాలను సాకుగా చూపించి.. జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపును పక్కన పెట్టారు. కార్పొరేటర్ల విహార యాత్రకు మాత్రం ప్రజల సొమ్మును వెచ్చించడం ఇప్పుడు జీవీఎంసీలో చర్చనీయాంశమైంది.

కౌన్సిల్ ఆమోదం లేకుండా నిర్ణయం!

జీవీఎంసీ పరిధిలో ఏదైనా టెండర్లు, పనులకు సంబంధించి స్థాయీ సంఘం, కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ టూర్ విషయంలో మాత్రం ఆ నిబంధనలను గాలికొదిలేశారు. కేవలం ముందస్తు అనుమతుల పేరుతో మేయర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేలా చేశారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా మేయర్ ముందస్తు అనుమతులు ఇచ్చిన పనులపై ఇటీవల జరిగిన కౌన్సిల్‌లో కూటమి కార్పొరేటర్లు నోరేసుకుని పడిపోయారు. కానీ ఈ విహారయాత్రకు మాత్రం ఇదే తరహాలో అనుమతి పొంది టూర్‌కు సిద్ధమైపోయారు. అభివృద్ధి పనులకు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలకు కోతలు విధిస్తున్న కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు.. ఇటువంటి విహార యాత్రల పేరుతో జీవీఎంసీ ఖజానాకు తూట్లు పొడవడం పట్ల వామపక్ష కార్పొరేటర్లు మండిపడుతున్నారు.

నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు

- కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరి
- నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ప్రారంభం



నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌదరి

పెదగంట్యాడ (విశాఖ): స్కిల్ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. మండలంలోని ప్రగతి మైదానం వద్దనున్న ఆంధ్ర మెడికల్ టెక్ జోన్(ఏఎంటీజెడ్)ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయనకు మెడిటెక్ మేనేజింగ్ డైరెక్టర్ జితేందర్ శర్మ స్వాగతం పలికారు. మెడ్‌టెక్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆపై నేషనల్ స్కిల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్స్‌టెన్షన్ సెంటర్ క్రాఫ్ట్స్ ఇన్‌స్ట్రక్టర్ పథకం కింద 2024–25లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రెనింగ్ కింద అధునాతన వృత్తి శిక్షణ కంప్యూటర్స్‌కు సంబంధించి వివిధ అప్లికేషన్లపై పలు రకాల శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకు అధునాతన లేబొరేటరీని సిద్ధం చేశామన్నారు. శిక్షణ పొందే వారికి ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ముందుగా మెడ్‌టెక్‌లోని మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం మైనపు విగ్రహాన్ని సందర్శించారు. కలాం జయంతిని పురస్కరించుకుని పూలమాల వేసి నివాళులర్పించారు.

22న రైతాంగ ప్రాంతీయ సదస్సు

అనకాపల్లి: ఈనెల 22న స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో ‘రైతాంగ ప్రాంతీయ సదస్సు’ నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం ఉత్తరాంధ్ర ప్రాంత జిల్లా సమితి అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల అభివృద్ధికి నిధుల కేటాయింపు, బాబూ జగ్జీవన్‌రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఆవశ్యకత గురించి సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు. ఉత్తరాంధ్రలోని వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొంటున్నట్టు వారు చెప్పారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు నేడు


ఎంఈవో పడాల్‌దాస్

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు సర్వం సిద్ధమైంది. బుధవారం ఇక్కడ నిర్వహించే క్రీడాకారుల ఎంపిక పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం బి. పడాల్‌దాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఇక్కడ ఏర్పాట్లు పరిశీలించి వివరాలను వెల్లడించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్–14 విభాగంలో ఫుట్‌బాల్, అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు సెపక్ తక్రా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఉదయం 8 గంటలకు స్థానిక హైస్కూలు మైదానానికి చేరుకోవాలని సూచించారు.

సీజ్ చేసిన వాహనాలకు మరో అవకాశం

అనకాపల్లి: జిల్లా ఆర్టీవో కార్యాలయం పరిధిలో రవాణా శాఖ తనిఖీల్లో అధికారులు సీజ్ చేసిన వాహనాలకు వాటి యజమానులు అపరాధ రుసుం, పన్నుబకాయిలు ఈ నెల 23వ తేదీలోపు చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి పి.మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు గూడ్స్ వాహనాలు, ఒక మ్యాక్స్ క్యాబ్‌ను సీజ్ చేశామన్నారు. వీటికి సంబంధిత వాహనదారులు, ఫైనాన్సర్లు తక్షణమే ఫైన్ చెల్లించి తీసుకెళ్లాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి కత్తిసాము పోటీలకు కశింకోట విద్యార్థి


విద్యార్థి గుణశేఖర్

కశింకోట: స్థానిక డీసీఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి కె.గుణశేఖర్ రాష్ట్ర స్థాయి కత్తిసాము పోటీలకు ఎంపికయ్యాడు. చోడవరం మండలం గోవాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ – 17 విభాగంలో ప్రతిభ చూపి ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం అచంట రవి, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. త్వరలో నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు.

182 మంది లైసెన్స్ రద్దుకు సిఫార్సు

బీచ్‌రోడ్డు: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘించిన 182 మంది లైసెన్సులను రద్దు చేయాలని ఆర్టీవోకు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సిఫార్సు చేశారు. మంగళవారం సిరిపురం, బీచ్‌రోడ్డు, రామ్‌నగర్ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

మావల్ల కాదు.. ఈక్విటీకి వెళ్లిపోతాం..!!

- నష్టాల ఊబిలో కూరుకుపోతున్న డీసీఐ
- 100% వేతనాలు చెల్లింపులకూ కటకట
- చేతులెత్తేస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్
- ఈ ఏడాది తొలి త్రైమాసికంలో రూ.30 కోట్ల నష్టాన్ని చవిచూసిన సంస్థ
- రూ.450 కోట్ల ఈక్విటీలకు వెళ్తామంటూ పోర్టులకు ప్రతిపాదనలు
- ఆర్థిక సాయమందించేందుకు పోర్టు సమాలోచనలు
- ఈక్విటీకి వెళ్లకుండా నిరోధించేందుకు సన్నాహాలు



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం : వరుసగా మూడేళ్లు లాభాల బాటపట్టిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్) ఈ ఆర్థికంలో తొలి త్రైమాసికంలోనే ఏకంగా రూ.30 కోట్ల నష్టాల బారినపడింది. దీంతో షేర్ ముఖ విలువ కూడా తగ్గుముఖం పట్టింది. రెండో త్రైమాసికంలోనూ అదే శైలిలో ఫలితాలు కనిపిస్తుండటంతో ఉద్యోగులు, అధికారుల్లో కలవరం మొదలైంది. నష్టాల ఊబిలో కూరుకుపోతూ 100 శాతం జీతాల చెల్లింపులపైనా భారం పడుతుండటంతో ఈక్విటీలకు వెళ్లిపోవాలని భావిస్తున్నారు. రూ.450 కోట్లకు ఈక్విటీలకు వెళ్లేందుకు అనుమతివ్వాలంటూ కన్సార్టియం పోర్టులకు ప్రతిపాదనలు పంపించింది. ఈ ప్రతిపాదనలతో మళ్లీ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వస్తుందేమోననే ఆందోళన డీసీఐ ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది. ఏడేళ్ల క్రితం డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసినప్పుడు ఉద్యోగులంతా సంఘటితమై పోరాటం సాగించారు. వీరి పోరుకు మద్దతుగా విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) నిలిచింది. మరో మూడు పోర్టులతో కలిసి డీసీఐ బాధ్యతను తన భుజస్కంధాలకెత్తుకుంది. డీసీఐకు కన్సార్టియంగా విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) 19.47 శాతం, జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్ట్ 18 శాతం, పారాదీప్ పోర్టు ట్రస్ట్ 18 శాతం, దీన్‌దయాళ్ పోర్టు ట్రస్ట్ 18 శాతం వాటాలతో డీసీఐకి బాసటగా నిలిచాయి. దీంతో ప్రైవేటీకరణ నిర్ణయం ఆగిపోయింది. ఆ తర్వాత లాభాల బాటలో పయనించింది. మూడేళ్ల క్రితం ఎండీ, సీఈవో నియమాకంలో అవకతవకలు జరిగిన విషయం వెలుగులోకి రావడం విజిలెన్స్ విచారణ నిర్వహించి ఎండీని తొలగించడం.. తర్వాత ఆయన స్థానంలో వచ్చిన కొత్త ఎండీ పదవీ కాలం ముగియడం చకచకా జరిగిపోయింది. ఇక అక్కడ నుంచి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పతనం మొదలైంది. కొత్త ఎండీ, సీఈవోని ఇంతవరకూ నియమించకుండా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబేకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించినా ఫలితం మారలేదు.

రెండో త్రైమాసికంలోనూ నష్టాలేనా.?

2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.31.40 కోట్ల నష్టాల్ని డీసీఐ మూటకట్టుకుంది. 2023–24 తొలి త్రైమాసికంలో రూ.15.15 కోట్ల నికరలాభాలను ఆర్జించిన డీసీఐ ఆదిలోనే 300 శాతం నష్టాలను చవి చూసింది. అదేవిధంగా గతేడాది తొలి త్రైమాసికంలో రూ.204.51 కోట్లు ఆదాయం రాగా ఈసారి మాత్రం కేవలం రూ.150.80 కోట్లు మాత్రమే ఆర్జించింది. డ్రైడాక్‌ల రిపేర్లు, ఆరు వరకూ డ్రెడ్జర్ల అత్యవసర మరమ్మతు పనులు నిర్వహించడమే నికరలాభాలను ఆర్జించకపోవడానికి కారణమని అధికారులు తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. దీంతోపాటు షేర్ ముఖ విలువ కూడా దారుణంగా పడిపోయింది. గతేడాది డీసీఐ షేరు ముఖ విలువపై రూ.5.41 ఆదాయం ఉండగా.. ఈసారి ప్రస్తుతం షేర్ విలువపై రూ.–11.22 నష్టం చవిచూస్తున్నారు. దీంతో డీసీఐపై మదుపరుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఫలితంగా నష్టాలు మరింత చుట్టుముడుతున్నాయి. రెండో త్రైమాసికంలోనూ నష్టాలే ఎదురయ్యేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా డీసీఐ ఖజానా పూర్తిగా ఖాళీ అయిపోతోంది.

ఏడాదిలోనే కుదేలు

గతేడాది వరకూ అద్భుతంగా సాగిన డీసీఐ పయనం.. మళ్లీ కుదేలయ్యే స్థితికి చేరుకున్న నేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో అధికారులు సొంత నిర్ణయాలు అమలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికిప్పుడు కనీసం రూ.450 కోట్లు వరకూ సమీకరిస్తే తప్ప డీసీఐ కోలుకోలేని స్థితిలో ఉంది. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులకు దిగజారే స్థితిలో ఈక్విటీకి వెళ్లడమే శరణ్యమని భావిస్తున్నారు. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కి వెళ్తూ రూ.450 కోట్లకు ఈక్విటీని ఆఫర్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే కన్సార్టియం పరిధిలో ఉన్న నేపథ్యంలో సొంత నిర్ణయం తీసుకోలేని పరిస్థితులుండటంతో పెద్దన్నగా వ్యవహరిస్తున్న విశాఖ పోర్టుకు ప్రతిపాదనల ఫైలుని పంపించారు. అయితే ప్రస్తుతం డీసీఐ ఎండీగా వ్యవహరిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దూబే మాత్రం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని అధికారులను సూచించినట్లు తెలుస్తోంది. ఎలాగైనా పోర్టు నుంచి నిధులు సమీకరించి.. ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కనీసం రూ.400 కోట్లెనా తీసుకొచ్చి డీసీఐని కొంత మేర గట్టెక్కించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ప్రయత్నాలు విఫలమైతే తమ పరిస్థితేంటోననే ఆందోళనలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఉద్యోగ వర్గాలు కలవరపడుతున్నాయి.

ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ యూనిట్

- జిల్లాలో 5 సోలార్ మోడల్ గ్రామాల ఎంపిక
- కలెక్టర్ విజయ కృష్ణన్


జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలు చేస్తుందని కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం (మఫ్ట్ బిజిలీ యోజన)పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంప్రదాయేతర ఇంధన వనరులు ప్రోత్సాహక బహుమతికి ఐదు గ్రామాలను ఎంపిక చేసి పూర్తిస్థాయిలో సోలార్ మోడల్‌గా రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం గురించి విద్యుత్ శాఖ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గృహ, దుకాణ సముదాయాలు, ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసుకునేలా ఆ ప్రాంత అసిస్టెంటు ఇంజనీర్లు పనిచేయాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ముప్పై వేల సోలారు యూనిట్లు ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని, రూ.1300 ఫీజు చెల్లించిన తర్వాత మాత్రమే దరఖాస్తు ప్రాసెస్ చేయబడుతుందన్నారు. మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఒక కిలోవాటుకు రూ.30 వేలు, రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీగా ఇస్తుందన్నారు. యూనిట్ స్థాపించిన తర్వాత 45 రోజుల్లో తిరిగి వినియోగదారుని బ్యాంకు ఖాతాకు నగదు అందిస్తుందని తెలిపారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం ఉందని, పెట్టుబడి మొత్తం మూణ్నాలుగేళ్లలో తిరిగి వచ్చేస్తుందని తెలిపారు. కిలోవాట్ యూనిట్ ఏర్పాటుకు 300 వందల యూనిట్ల వినియోగించే వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 1,677 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 288 మంది మాత్రమే రూ.1300 ఫీజు చెల్లించారని, మిగిలిన వారితో ప్రాసెసింగు ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, నెడ్ క్యాప్ డెవలప్‌మెంటు అధికారి సిహెచ్.పవన్, విద్యుత్ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలు, సోలారు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాయకరావుపేట యువతికి ఆలిండియా 127వ ర్యాంకు

- సీఎస్ఐఆర్ ఫలితాల్లో లక్ష్మీ ప్రహర్ష ప్రతిభ



పాయకరావుపేట: కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) నేషనల్ ఎలిజిబిటీ టెస్టు ఫలితాల్లో పాయకరావుపేటకు చెందిన కొసిరెడ్డి లక్ష్మీ ప్రహర్ష ఆలిండియా 127వ ర్యాంకు సాధించింది. జూలై 25, 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా 187 నగరాల్లో 348 కేంద్రాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన ఈ పరీక్షకు 2.25 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో జేఆర్ఎఫ్ అర్హత సాధిస్తే సీఎస్ఐఆర్ పరిధిలోని రీసెర్చ్ సెంటర్లలో, యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. వర్సిటీలు, లేదా డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హులవుతారు. ప్రస్తుతం లక్ష్మీ ప్రహర్ష ఫిట్జీ ఇంటర్నేషనల్ ఢిల్లీలో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఫిజిక్స్ విభాగంలో ఐఐటీ, ఎన్ఐటీ లేదా సెంట్రల్ యూనివర్సిటీ నుంచి రీసెర్చ్ చేసి డాక్టరేట్ తీసుకుని ప్రొఫెసర్‌గా స్థిరపడాలని తన ధ్యేయంగా పేర్కొన్నారు. ఆమె తండ్రి డాక్టర్ కోసిరెడ్డి వీర్రాజు విజయవాడలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.వి.ఈ.ఎల్. నాయుడు అభినందనలు తెలియజేశారు.

లాకౌట్ ఎత్తివేయాలని 'అభిజిత్' కార్మికుల ఆందోళన



అచ్యుతాపురం జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం (మునగపాక): అక్రమ లాకౌట్‌ను ప్రకటించిన అభిజిత్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కార్మికులు కదం తొక్కారు. వారికి సీఐటీయూ మద్దతు తెలిపింది. అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీ సోమవారం లాకౌట్‌ను ప్రకటించడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు, కార్మికులు రెండో రోజు ఆందోళన ఉధృతం చేశారు. కంపెనీ గేటు వద్ద ధర్నా నిర్వహించి పాదయాత్రగా పరిశ్రమల జోనల్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గేటు మూసేయడం సమంజసం కాదన్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించి, వెయ్యి మంది కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటున్న కంపెనీ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కరోనా కష్టకాలంలో కూడా కంపెనీకి వచ్చి కార్మికులు పనిచేసిన విషయాన్ని యాజమాన్యం మరిచిపోవడం తగదన్నారు. అనంతరం జోనల్ కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, రైతు సంఘ జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, మండల కన్వీనర్ సోమునాయుడితో పాటు పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

జన్యుకారణాలతో డిస్లెక్సియా బాధితులు

- జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి శకుంతల


మామిడిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: స్పెసిఫిక్ లెర్నింగ్ డిజార్డర్‌లో 80 శాతం మంది డిస్లెక్సియా(భాషా అవరోధ బలహీనత) బాధితులుగా ఉన్నారని, ఇది జన్యుకారణాలతో ఏర్పడిన నాడీ సంబంధిత వైవిధ్యత అని జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.శకుంతల తెలిపారు. మండలంలోని మామిడిపాలెంలో హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వీరి ఐక్యూ సగటు ప్రజ్ఞ కన్నా అధికంగా ఉంటుందన్నారు. చదివే విషయంలో సమస్యలు ఉండటాన్ని డిస్లెక్సియా అంటారన్నారు. రాయడంలో అవరోధాలు ఉంటే డిస్క్ గ్రాఫియా అని, గణిత చేయటంలో సమస్యలు ఉంటే డిస్కాల్క్యులా అని వివరించారు. శరీరంలోని వివిధ భాగాలలో సమన్వయం లోపిస్తే డిస్ప్రెసియా అంటారన్నారు. సహిత ఉపాధ్యాయుడు బి.వి.వరప్రసాద్ మాట్లాడుతూ వీరిని 8 ఏళ్ల వయస్సు వచ్చే నాటికి గుర్తించి, విద్యాపరమైన విషయాలలో సర్దుబాటు చేసుకునేందుకు విస్తృతమైన అభ్యాసన అనుభవాలు అందించాలని కోరారు. హెచ్‌ఎం బి.శ్రీధర్, ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయ్, వసంతరావు, పట్టాభి దయాసాగర్, కామేశ్వరరావు, శేషు పాల్గొన్నారు.

వరిలో కాండం తొలిచే పురుగు నివారణ


సమావేశంలో మాట్లాడుతున్న ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉన్నందున కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, లేదా ఎకరాకు 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను వేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4 కిలోల క్లోరాంత్రనిలిప్రోల్ గుళికలను 8 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. సుడిదోమ ఆశించినట్లయితే నివారణకు పొలం నుంచి నీటిని బయటికి తీసివేయాలన్నారు. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టి, తర్వాత డైనోటో ఫ్యురాన్ 0.4 గ్రాముల లేదా ట్రిఫ్లూమిజోఫైరిం 0.48 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందని, తెగులు నివారణకు అజోక్సిస్ట్రోబిన్ 1 మీ.లీ. లేదా అజోక్సిస్ట్రోబిన్, టెబుకొనజోల్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని చెప్పారు. దుబ్బు చేసే దశలో వరి పైరుకు 23 కిలోల యూరియాను పై పాటుగా వేసుకోవాలన్నారు. చెరకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తిచేసే పేను బంక పురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు కిలో మల్టికెను పిచికారీ చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు కందిలో వడలు తెగులు ఆశించవచ్చని, నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వర్ష సూచన ఉన్నందున, తేమను ఉపయోగించుకుని రబీ పంటలు వేసేందుకు నేల తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.గౌరీ, బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సంఘం ఎన్నికకు నేడు నామినేషన్లు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గానికి ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు నర్సుల సంఘాలను ఇటీవల కలిపి ఎన్నికల నిర్వహిస్తున్న సంగతి విధితమే. కేజీహెచ్ క్లాక్ రూమ్‌లో(ఆంధ్రా బ్యాంక్) నామినేషన్లు బుధవారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు నామినేషన్లు ప్రక్రియ జరుగుతుందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు (అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి) రూ.వెయ్యి చెల్లించాలి. పాలకవర్గ సభ్యులుగా పోటీ చేసేవారు నామినేషన్ ఫీజు రూ.500లు చెల్లించాలి.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి


కాలువలో పడి ఉన్న అశోక్‌రెడ్డి మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు అశోక్‌రెడ్డి కాలువలో పడి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం సంఘటన జరగగా మంగళవారం ఉదయం బయటపడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసుల వివరాలు మేరకు.. పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన జి.అశోక్‌రెడ్డి (29) సింటర్ ప్లాంట్‌లో టీఎంసీ కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అనారోగ్యం నుంచి కోలుకొని సోమవారం బీ షిఫ్ట్ విధులకు హాజరై సాయంత్రం 7 గంటల సమయంలో బైక్‌పై బయల్దేరాడు. అక్కడ ఉన్న కల్వర్ట్ పరిసర ప్రాంతం బురదగా ఉండటంతో బైక్ స్కిడ్ అయి పక్క ఉన్న కల్వర్ట్‌లో జారి పడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. సీఐ కేశవరావు, సిబ్బంది సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించారు. మృతిని శరీరంపై గాయాలున్నట్టు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అశోక్ రెడ్డి తండ్రి స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి. ఏఎస్ఐ త్రినాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాస్పత్రికి..నిర్లక్ష్య జబ్బు


సాయంత్రం ఆరు గంటలకు కేజీహెచ్ రక్త పరీక్షల కేంద్రం వద్ద రిపోర్టుల కోసం క్యూ కట్టిన రోగి బంధువులు

ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌లో సిబ్బంది నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. రోగులను తరలించేందుకు కూడా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. దీంతో రోగులను వారివారి బంధువులే వీల్‌చైర్‌లో వివిధ పరీక్షలకు తీసుకువెళుతున్నారు. రోజురోజుకూ కేజీహెచ్‌లో పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే రక్త పరీక్షలు నిర్వహించడం, రిపోర్టులు ఇవ్వడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతుండడంతో బాధితులు సహనం కోల్పోతున్నారు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం

కన్నకొడుకే కాల యముడు

- పెందుర్తి పీఎస్ పరిధి నరవలో దారుణహత్య
- తండ్రిని కత్తితో నరికి చంపిన కుమారుడు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


కొడుకు చేతిలో హతమైన దేముడు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. కన్న కొడుకే కాలయముడై తండ్రిని నరికి చంపాడు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నరవ శివారు మనిపాలెంలో ఎంగలి దేముడు(60) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. దసరా నేపథ్యంలో కొద్ది రోజులుగా కుమారుడు గోపితో కలిసి తరచూ మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇంటికి వచ్చి పడుకున్న తండ్రి గొంతును కత్తితో కొడుకు కోసేశాడు. దీంతో తీవ్ర రక్త స్రావమై దేముడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. నిందితుడు గోపిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కశింకోటలో భారీ వర్షం


కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేరిన వర్షపు నీరు

కశింకోట: మండలంలో సోమవారం అర్ధ రాత్రి భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా పెద్ద ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కశింకోట మండల పరిషత్ కార్యాలయం ముందు భాగం, పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నీరు చేరింది. ఆర్టీసీ బస్టేషన్ ప్రాంతం బురదమయంగా మారింది. తాళ్లపాలెం కూడలిలో నీరు చేరడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సరఫరాకు కశింకోటతోపాటు పలుచోట్ల అంతరాయం కలిగింది. తర్వాత సిబ్బంది పునరుద్ధరించారు. ఉదయం 8.30 గంటలకు 59.2 మిల్లీ మీటర్ల వర్షపాతం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో నమోదైంది. వర్షం వల్ల వరి పొలాల్లో నీరు చేరింది. వరి పొలాలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల 14వ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలో 25 ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు హాజరు కానున్నారన్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతరకు ఆహ్వానం


డాక్టర్ సాయిరాం

పరవాడ: అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర వరల్డ్ రికార్డులో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు కవి, రచయిత, గాయకుడు, సామాజికవేత్త ఎంఎస్ఎస్ సాయిరాం మంగళవారం మీడియాకు తెలిపారు. ఆయన గత కొంత కాలంగా పరవాడ పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. సాయిరాంను పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్, వైద్య సిబ్బంది అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 215 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	5,330
రెండో రకం	3,590	4,300
మూడోరకం	3,300	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
శ్వాగ్	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	:పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
జిగ్రా	:వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	:శ్రీసత్య
మార్టిన్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 63 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 361 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అన్నదాతల్లో గుబులు

- తుపాను హెచ్చరికలతో ఆందోళన
- పొట్ట దశలో వరి పంట
- నష్టపోతామని ఆవేదన

ప్రకృతి విపత్తుల నుంచి వరి పంటను కాపాడుకోవడం అన్నదాతకు సవాల్‌గా మారింది. వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో కలవరం మొదలైంది. తెగుళ్ల బారిన పడి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పంట పొట్టదశకు వచ్చింది. ఈ తరుణంలో భారీ వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తమవుతోంది.


పొట్టదశలో వరి పంట

తుమ్మపాల: ఖరీఫ్ సీజన్‌లో వరి రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. తాజాగా వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలో మంగళవారం తెల్లవారు కురిసిన వర్షంతో పాటు రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని హెచ్చరించడంతో వరి చేలకు మరో మరో తుఫాన్ గండం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత నెల కురిసిన భారీ వర్షాలతో ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు నష్టపోయారు. పంట కాలువల్లో పూడిక కారణంగా వరి పొలాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో శంకరం, రేబాక, తుమ్మపాల, ఆవఖండం, దిబ్బపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తదితర గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో వరిచేలు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ రైతులు వ్యయప్రయాసలకోర్చి పంటలను కాపాడుకున్నారు. ప్రస్తుతం చాలా వరకు వరి ఎదిగి పొట్టదశకు వస్తోంది. రానున్న డిసెంబర్‌కు వరి చేలు కోత దశకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తుఫాన్ కారణంగా తరుచూ వరిచేలు ముంపునకు గురవ్వడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని తద్వారా తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ అందని పెట్టుబడి సాయం..

అన్నదాతలకు ఆసరాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పీఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయంగా ఇచ్చేవారు. కౌలు రైతులకు కూడా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఏటా మే నెలలోనే పెట్టుబడి సాయం మొదటి విడత అందించి అన్నదాతలను ఆదుకునేవారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఆచరణలో చూపలేదు. దీంతో విపత్తులతో అల్లాడుతున్న రైతులు అధిక పెట్టుబడులతో ఇబ్బందులు పడుతున్నారు. మే నెలలో అందించాల్సిన పెట్టుబడి సాయం అక్టోబరు వచ్చినా ఇవ్వకపోవడంతో చంద్రబాబు ప్రభుత్వంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



భారీ వర్షాల హెచ్చరికలు ఉన్నందున వరిచేలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. మడులలో నీరు బయటకు పోయే మార్గాలు ఏర్పాటు చేసుకోవాలి. గడిచిన 12 గంటల్లో మండలంలో 25.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రైతులకు గ్రామాల్లో అవగాహన చేసి అప్రమత్తం చేస్తున్నాం.

– పి.రంగాచారి, వ్యవసాయ అధికారి, అనకాపల్లి మండలం

వర్షం కురిస్తే రాకపోకలు బంద్


విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీటిలో ఆగిపోయిన బస్సు

- విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలుస్తున్న నీరు
- వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు
- శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

అనకాపల్లి: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి. స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద దుస్థితి ఇది. దశాబ్దాలుగా వెంటాడుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణవాసులు కోరుతున్నా ప్రయోజనం లేకపోయింది. దీనిపై ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదని వాపోతున్నారు. మంగళవారం అనకాపల్లి నుంచి చోడవరం మీదుగా మాడుగుల మండలం జాలంపల్లి వెళ్లే బస్సు రైల్వే అండర్ బ్రిడ్జి వర్షపు నీటిలో చిక్కుకుపోయింది. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విధంగా రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షాకాలంలో నీరు చేరుకోవడంతో ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు రైల్వే, జీవీఎంసీ అధికారులు లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇది ఇప్పటికీ పూర్తి కావడం లేదు. రైల్వేశాఖ పరిధిలో బ్రిడ్జి నిర్మించిన పదేళ్లవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నిర్మించాల్సిన బ్రిడ్జి పనులు నేటికీ ప్రారంభించలేదు.

తక్షణమే చర్యలు తీసుకోవాలి..

కూటమి ప్రభుత్వం తక్షణమే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. రూ.20 లక్షలు కేటాయించి, వర్షాలు పడే సమయంలో నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

అనకాపల్లి–విశాఖ మెట్రో బస్సులు ఆపాలి...

అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే సమయంలో మెట్రో బస్సులు ప్రయాణికులు కోరిన చోట ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విశాఖ నుంచి అనకాపల్లి రాకపోకలు సాగిస్తున్నారు. అటువంటి సమయంలో విధులు ముగించుకుని వారి స్వగృహాలు వెళ్లే సమయంలో వాల్తేరు డిపో బస్సులు ప్రయాణికులు చెయ్యి ఎత్తినచోట ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దాంతో ఎక్కువ నగదు చెల్లించి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి


కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం శ్రీధర్

అనకాపల్లి: నేటి యువత అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని హెచ్‌ఎం శ్రీధర్ తెలిపారు. మామిడిపాలెం హైస్కూల్లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కలాం విగ్రహానికి మంగళవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి వన్నె తెచ్చిన శాస్త్రవేత్త కలాం అని కొనియాడారు. అనంతరం కలాం జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, ఉపాధ్యాయులు వసంతరావు, అనీరోజ్, లక్ష్మి, విజయలక్ష్మి, శైలజ, సుబ్రహ్మణ్యం, శ్రీను, కరుణ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ


కశింకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న కొరుప్రోలు వెంకటేశ్వరరావు

కశింకోట: నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై మంగళవారం కశింకోటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేర్చుకునే లోపం చదవడం, రాయడంపై ప్రభావం చూపిస్తుందన్నారు. కంప్యూటర్ వినియోగించడం ద్వారా వైకల్య విద్యార్థులు చదువుపై శ్రద్ధగా దృష్టి పెట్టేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు పి.వి.రమణమ్మ, ఎస్.దీప, బాలికల పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.రామునాయుడు, ఫిజియోథెరపిస్టు గీతా మోనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌జీఎస్‌ఏపై శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ఎంపీడీవో నరసింహరావు

అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ)పై నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు తెలిపారు. శిక్షణలో భాగంగా మొదటి రోజు మంగళవారం 16 గ్రామాల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు రెండు విభాగాలుగా ఈ నెల 18వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

వచ్చే సంక్రాంతికి అభివృద్ధి పనులు పూర్తి

కశింకోట: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వచ్చే సంక్రాంతికి పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తేగాడ, పేరంటాలపాలెం, జోగారావుపేట, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి పథకం నిధులతో నిర్మించనున్న రోడ్లకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి. రవి కుమార్, ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

5 గ్రామాల్లో పల్లె పండగ

అనకాపల్లి: మండలంలో ఐదు గ్రామాల్లో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. కోడూరులో రూ.25 లక్షలు, గోపాలపురంలో రూ.10 లక్షలు, గొలగాంలో రూ.50 లక్షలు, అక్కిరెడ్డిపాలెంలో రూ.50 లక్షలు, మారేడుపూడిలో రూ.10లక్షల నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామని కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. ఎంపీడీవో నరసింహరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

'హైస్కూల్ సమీపంలో మద్యం షాపు వద్దు'


జెడ్పీ హైస్కూల్‌కు సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అతి సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని వేరొక ప్రదేశానికి తరలించేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు బండారు రామునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణం ఉంటే విద్యార్థులపై చెడు ప్రభావం చూపే ప్రమాదముందన్నారు. నిబంధనల మేరకు గుడి, బడికి సమీపంలో మద్యం షాపుల్ని ఏర్పాటు చేయరాదన్నారు. ఈ మద్యం షాపును తరలించాలని ఇప్పటికే స్థానిక ప్రజలు ఎక్సైజ్ అధికారుల్ని అభ్యర్థించినా, పట్టించుకోలేదన్నారు. ఈ మద్యం దుకాణాన్ని దాటుకుంటూనే విద్యార్థులు రాకపోకలు సాగించాలని, ఇక్కడ మందుబాబుల ఆగడాలు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని తక్షణమే వేరే చోటుకి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారుల్ని ఆ ప్రకటనలో కోరారు.

తెగుళ్ల నివారణకు సత్వర చర్యలు


చింతలపాలెంలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో స్వప్న

కశింకోట: క్రిమిసంహారక మందులు జల్లి తెగుళ్ల నివారణకు రైతులు సత్వర చర్యలు తీసుకుని పంటలను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న సూచించారు. మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఆమె సందర్శించి వరి, చెరకు పంటలను పరిశీలించారు. వరికి సోకుతున్న పొడ తెగులు, దోమకాటు, ఇతర తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు ఎ. మధు, రైతు ప్రతినిధులు జెర్రిపోతుల నూకినాయుడు, మళ్ల గోపి, పచ్చికూర శ్రీను, మళ్ల రఘురాం తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం


మృతదేహం చేతిపై ఈగల్ పచ్చబొట్టు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరానికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానిక మత్స్యకారులు గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. తీరానికి చేరిన మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. శరీరంపై దుస్తుల్లేవు. కుడిచేతిపై ఎగురుతున్న ఈగల్ బొమ్మతో పాటు 27, ఎస్ డబ్ల్యూ ఎఫ్, ఎడమ చేతిపై 8 అండ్ సింబల్ పచ్చబొట్టు ఆనవాళ్లు ఉన్నాయి. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో 15 రోజుల క్రితం మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన తప్పిపోయిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మృతదేహన్ని గుర్తించిన వారు 9440796038 నంబరును సంప్రదించాలన్నారు. మృతదేహన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్ చిన్నికృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్‌ఏలు

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణను కోరారు. ఆయన్ను వీఆర్‌ఎల సంఘం అధ్యక్షుడు నీటిపల్లి గంగాధరరావు ఆధ్వర్యంలో మంగళవారం కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఖాళీ వీఆర్‌ఏల పోస్టుల్ని భర్తీ చేస్తే తమపై పనిభారం కొంతైనా తగ్గుతుందన్నారు. వారిలో వీఆర్‌ఏలు ఎం.అప్పారావు, నర్సింగరావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్

అనకాపల్లి: సమగ్ర భూ సర్వే చేపట్టిన గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు తహసీల్దార్ కె.విజయకుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో మండల, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమావేశమై ఆయన మాట్లాడారు. ఈనెల 17న కూండ్రం, 18న కుంచంగి, 19న వేటజంగాల పాలెం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. వీటిపై గ్రామాల్లో తప్పనిసరిగా దండోరా వేయించి, మినిట్స్ బుక్కు, ఫొటో, వీడియో, ఎస్ఎఫ్ఏ, ఎఫ్ఎంఈ, ఓల్డ్ అడంగల్ వంటి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీటీ వై.శ్రీరామూర్తి, ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల ఉధృతి.. నివారణ పద్ధతులు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

తుమ్మపాల: వరిలో తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణ పద్ధతుల ద్వారానే రైతులు కాపాడుకోవాలని డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రామారావు తెలిపారు. వెంకుపాలెం, బవులువాడ గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన వరి పొలాలను సందర్శించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. వరి ఆర్జీఎల్-2537 రకంలో ఆకుముడత, పొడ తెగులు ఉందని, నివారణకు హెక్సా కొనజోల్ మందు రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏవో పి.వి.బి.రంగాచారి మాట్లాడుతూ కఫీ-5204లో ఆకు ముడత నివారణకు క్లోరిపైరిపాస్ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున స్ప్రే చేయాలన్నారు. కఫీ- 5204 రకంలో దోమ ఉధృతికి లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫెట్, ఎకరాకు 25 కేజీలు యూరియా, 15 కేజీలు పోటాస్ వేయాలన్నారు. బ్యాక్టీరియా ఎండు తెగుళ్లు (పండా ఆకు) నివారణకు ప్లాంటోమైసిన్ 100 గ్రాముల పోటాస్ వేసుకోవాలని సూచించారు. ఏపీఎంఐపీ రంజిత మాట్లాడుతూ రైతులకు 50 సబ్సిడీపై స్ప్రింక్లర్లు, డ్రిప్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. సాయిల్ కన్జర్వేషన్ డివిజన్ అధికారి మురళీ, వెంకుపాలెం సర్పంచ్ నాగేశ్వరరావు, బవులువాడ ఎంపీటీసీ తోట విజయ్, నాయకులు నూకరాజు, శంకరరావు, నారాయణరావు, గ్రామ వ్యవసాయ అధికారి జ్యోతి మోహన్, సాయి గణేష్ పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్నకూటమి ప్రభుత్వం



నిత్యావసరాల ధరల పెరుగుదలపై రైతు బజార్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, ప్రజలు

పెందుర్తి: ఎన్నికల సమయంలో నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రజలకు అండగా ఉంటామని బూటకపు హామీలతో గద్దెనెక్కిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు అత్తిలి విమల ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు పాలనలో సామాన్యులు కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ వద్ద ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ ఓ వైపు తగిన విధివిధానాల్లేని ఇసుక పాలసీ కారణంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండా ఉన్న సమయంలో, ఇలా నిత్యావసరాల ధరలు పెరగడం విచారకరం అన్నారు. విజనరీగా చెప్పుకునే సీఎం చంద్రబాబుకు మోసం తప్ప, ప్రజల బాగోగులు పట్టవని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలు పెరిగి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ కులాలు, మతాలు, దీక్షలు అంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యావసరాల ధరలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, అన్నపూర్ణ, అసిరినాయుడు, ఎ.రమణ, కె.రామారావు, అరుణ, రజని, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై పాలకుల సవతి ప్రేమ

- సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు


మాట్లాడుతున్న కాసుబాబు

కె.కోటపాడు : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌పై పాలకులు చిన్నచూపు చూస్తున్నట్టు సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు అన్నారు. కె.కోటపాడులో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి అయిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే చర్యలను తీసుకునేలా ప్రభుత్వంపై పాలకులు ఒత్తిడిని తీసుకురావాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఉత్తరాంధ్రలో 18 నియోజకవర్గాల్లో 408 మండలాల్లో 1200 గ్రామాలకు పైగా గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు, ఎనిమిది లక్షల పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితి ఉంటుందని కాసుబాబు పేర్కొన్నారు. అత్యంత ప్రాముఖ్యత గల ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌ను పాలకులు కావాలనే వెనుకకు పెడుతున్నట్టు ఆయన ఆరోపించారు. రాబోయే బడ్జెట్లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు జరిగేలా ప్రభుత్వంపై పాలకులు ఒత్తిడిని తీసుకువచ్చి, ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు, సాగునీటిని అందించేలా చూడాలని కాసుబాబు కోరారు. రైతు సంఘం నాయకులు సన్యాసినాయుడు, రామునాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.